సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

90324 97123

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

జోన్-5 'స్పందన'కు ఐదు వినతులు



వినతులు పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ రాజు

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్-5 కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి 05 వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని జోనల్ సూపరింటెండెంట్ టి.ఎస్.ఎస్.రాజు స్వీకరించి పరిశీలించారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి 01, పబ్లిక్ హెల్త్‌కు 02, ఇంజినీరింగ్ విభాగానికి 02 చొప్పున అర్జీలు ఆయన తెలిపారు. వినతులు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని అర్జీదారులకు సూచించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ ఈఈ శ్రీనివాస్‌వర్మ, టౌన్ ప్లానింగ్ టీపీవో శ్రీలక్ష్మి, పబ్లిక్ హెల్త్ సూపర్‌వైజర్ ఎస్ జనార్దన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

37వ వార్డులో చురుగ్గా అభివృద్ధి పనులు



రోడ్డు పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ జానకీరామ్

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 37వ వార్డులో రూ.36 లక్షల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. కార్పొరేటర్ చెన్నా జానకీరామ్ సోమవారం పెయిందొరపేటలో వేస్తున్న రోడ్ల పనులను పరిశీలించారు. త్వరితగతిన పూర్తి చేసి వార్డు ప్రజలకు అందుబాటులోకి తేవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కాసారపు వాసు, దైవకుమార్, రెయ్యి రేవతి డేవిడ్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి స్వర్ణ పుష్పార్చన

దాబాగార్డెన్స్: విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని ఆలయ వర్గాలు తెలిపాయి. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నెంబరు 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు. ఈ మెయిల్ ఐడీ endow&eokanaka@gov.in ద్వారా వివరాలు తెలుసుకోవచ్చు.

ఆర్టీసీ బస్సులో మేయర్ ప్రయాణం



బస్సు దిగి జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోకి వెళ్తున్న మేయర్ హరివెంకటకుమారి

దాబాగార్డెన్స్: పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణలో భాగంగా మేయర్ గొలగాని హరివెంకటకుమారి సోమవారం ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేశారు. తన క్యాంపు కార్యాలయం నుంచి నడుచుకుంటూ ఆర్టీసీ బస్టాప్‌కు చేరారు. సిటీ బస్సులో సాధారణ ప్రయాణికుల వలే డబ్బులిచ్చి టికెట్ తీసుకున్నారు. అనంతరం జీవీఎంసీ ప్రధాన కార్యాలయం వరకు ప్రయాణించి జీవీఎంసీలో నిర్వహించిన డయల్ యువర్ మేయర్, స్పందన కార్యక్రమంలో పాల్గొన్నారు. చాలా మంది అధికారులు సొంత వాహనాల్లో కార్యాలయానికి వస్తున్నట్టుగా తెలిసిందని, సొంత, ప్రభుత్వ వాహనాలు విడనాడి ఆర్టీసీ బస్సుల్లో రావాలని ఆదేశించారు.

విస్తృతంగా 'మా నమ్మకం నువ్వే జగన్'



వెంకటేశ్వరమెట్టపై ప్రజలకు పథకాలపై వివరిస్తున్న బొర్రా విజయలక్ష్మి, తదితరులు



సచివాలయంలో వలంటీర్లతో మాట్లాడుతున్న విల్లూరి భాస్కరరావు



27వ వార్డు అశోక్‌నగర్‌లో ఇంటికి స్టిక్కర్ అతికిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్: దక్షిణ నియోజకవర్గంలో 'మా నమ్మకం నువ్వే జగన్'కార్యక్రమం విస్తృతంగా సాగుతోంది. పలు వార్డుల్లో క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుల నేతృత్వంలో పెద్ద ఎత్తున సోమవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. గడపగడపకు వెళ్లి సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. సమస్యలు తెలుసుకున్నారు. ప్రజల అనుమతితో ఇంటి గోడలకు సీఎం జగన్ ఉన్న స్టిక్కర్లను అంటించారు. గత నాలుగేళ్లుగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు వివరిస్తూ 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతు పలికి, ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ఎన్నుకోవాలని అభ్యర్థించారు. ప్రజా సమస్యలు వాట్సప్ ద్వారా తెలపొచ్చంటూ సూచించారు. 37వ వార్డులో కార్పొరేటర్ చెన్నా జానకీరామ్ నేతృత్వంలో 189 సచివాలయం పరిధిలో ఓ ఇంటి వద్ద అంటించిన స్టిక్కర్‌కు ఓ పెద్దాయన క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టూరిజం డైరెక్టర్ రెయ్యి డేవిడ్‌రాజు, ఆకుల యేసు, వెంకటలక్ష్మి, నిమ్మకాయల ఆదిలక్ష్మి, కాసారపు వాసు, వార్డు కన్వీనర్లు దైవకుమార్, రమణ, ఆనంద్, శేఖర్, రోజా, రమణి, గృహసారథులు పాల్గొన్నారు.



జీవీఎంసీ 37వ వార్డులో ముఖ్యమంత్రి జగన్ స్టిక్కర్‌కు క్షీరాభిషేకం చేస్తున్న వృద్ధుడు



30వ వార్డులో పథకాలపై వివరిస్తున్న కార్పొరేటర్ అప్పలరత్నం, క్లస్టర్ ఇన్‌చార్జి వాసు

- జీవీఎంసీ 28, 29, 30, 37 వార్డు(క్లస్టర్-4)ల్లో అంగటిదిబ్బ, సాలిపేట, కొత్త జాలరిపేట, వెంకటపతిరాజునగర్, రామజోగిపేట, చెన్నవీధి, పెయిందొరపేట తదితర ప్రాంతాల్లో ఆయా కార్పొరేటర్లతో కలిసి క్లస్టర్-4 ఇన్‌చార్జ్ పీతల వాసు చురుగ్గా పర్యటించారు. ఈ కార్యక్రమంలో 30వ వార్డు కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం, క్లస్టర్-4 కన్వీనర్లు వెంకట్, వడ్డాది దిలీప్, కొరిపిల్లి ఆనంద్, దేవరాజు, మణి, కల్యాణి, శ్యామ్, టి.శ్రీనివాస్, కోరాడ సురేష్, బెవర మహేష్, నీలాపు లక్ష్మి, అడపా శివ, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

అల్లిపురం: నీలమ్మవేపచెట్టు అమ్మవారి దేవస్థానం చైర్మన్ బొర్రా విజయలక్ష్మి, సచివాలయ కన్వీనర్ బొర్రా శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని వెంకటేశ్వరమెట్ట-2 సచివాలయం పరిధి, బంగారుమెట్ట ప్రాంతంలో నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు. స్టిక్కర్ అతికించి ఇంటి యజమాని ఫోన్ నుంచి మిస్డ్‌కాల్ చేశారు. ఈ కార్యక్రమంలో గృహసారథి ఇమంది త్రినాథ్, వలంటీర్లు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

- పార్టీ వార్డు అధ్యక్షుడు రంధి గోపీకృష్ణ ఆధ్వర్యంలో కుమ్మరవీధి సచివాయం పరిధిలో పర్యటించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ పోలవరపు పావని, ప్రసాద్, వలంటీర్లు గుణ, రవణమ్మ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లు, గృహసారథులతో సమావేశం

జగదాంబ: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ఇంటింటా నిర్వహించాలని 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు సూచించారు. జీవీఎంసీ 35వ వార్డు ప్రసాద్‌గార్డెన్స్‌లోని 209 సచివాలయంలో వలంటీర్లు, గృహ సారథులతో సోమవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు కలిసి ఈ కార్యక్రమం సమగ్రంగా నిర్వహించాలని కోరారు. ప్రభుత్వం ఇప్పటివరకు ప్రవేశపెట్టిన పథకాలు అర్హులందరికీ అందుతున్నాయా తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

సీతమ్మధార: జీవీఎంసీ 27వ వార్డు క్లస్టర్-1లోని శ్రీనగర్ సచివాలయం అశోక్‌నగర్ లో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. ప్రభుత్వ పనితీరుపై ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన మా నమ్మకం నువ్వే జగన్ నినాదాన్ని ఒక ప్రధాన అంశంగా పెట్టామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ 27వ వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి, నాయకులు అజయ్‌రెడ్డి, ఎ.కుమారి, అనిల్, రమణమ్మ, లక్ష్మి, శైలజ, వెంకటలక్ష్మి, తలపాక విజయ్, రవి, పెద్దాడ దేవి, గృహసారథులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఏవోఐ మహాసభ లోగో ఆవిష్కరణ



లోగో ఆవిష్కరిస్తున్న ఎల్ఐసీ ఏవోఐ ఆహ్వాన కమిటీ

దాబాగార్డెన్స్: ఎల్ఐసీ ఏజెంట్స్ ఆర్గనేజేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ ఏవోఐ) అఖిల భారత జాతీయ 6వ మహాసభలు ఈ నెల 22, 23 తేదీల్లో విశాఖలో నిర్వహించనున్నారు. దాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా నిర్వహించనున్న మహాసభల లోగోను జగదాంబ జంక్షన్ సమీపాన గల సిటూ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహాసభల చైర్మన్ సీహెచ్ నరసింగరావు మాట్లాడుతూ ఎల్ఐసీని కాపాడుకోవడం.. ఏజెంట్లను రక్షించుకోవాలన్న నినాదంతో 2003లో సంఘం ఆవిర్భవించిందని తెలిపారు. అప్పటి నుంచి లక్ష్యం కోసం పోరాడుతున్న ఏకైక జాతీయ స్థాయి ట్రేడ్ యూనియన్ అని పేర్కొన్నారు. మహాసభకు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి 600 మంది ప్రతినిధులు హాజరు కానున్నారని తెలిపారు. మహాసభల్లో ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా భవిష్యత్ పోరాటాలు రూపొందించడం జరుగుతుందని చెప్పారు. వంద మందితో ఆహ్వాన సంఘాన్ని ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో ఆర్గనైజేషన్ వైస్ ప్రెసిడెంట్ ఎల్.మంజునాథ్, జోనల్ సెక్రటరీ పి.ఎల్. నరసింహారావు, విశాఖ డివిజన్ సెక్రటరీ ఎస్.ఆర్. ఠాగూర్, సిటూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు అరకు ఎమ్మెల్యే ఫాల్గుణ పరామర్శ



కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వర్షితతో మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణ

మహారాణిపేట: కేజీహెచ్ పిల్లల వార్డులో చికిత్స పొందుతున్న అరకు నియోజకవర్గానికి చెందిన పాంగి వర్షితను ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణ సోమవారం పరామర్శించారు. అరకు ప్రాంతానికి చెందిన పాంగి వీరన్న(లేటు) కుమార్తె వర్షిత గుండెలో నీరు చేరడంతో ఆపరేషన్ కోసం కేజీహెచ్‌లో చేర్చారు. ఆమె వైద్యం కోసం వైద్యులతో ఎమ్మెల్యే మాట్లాడారు. అనంతరం వర్షిత కుటుంబ సభ్యులు కొంత ఆర్థిక సహాయం అందించారు.

- ఇటీవల బైక్‌పై వెళ్తూ ప్రమాదవశాత్తు గాయపడి విశాఖ పినాకిల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అరకు వ్యాలీ మండలం కొర్రగూడ గ్రామ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అర్మ చంద్రమోహన్ దాస్(53)ను ఎమ్మెల్యే ఫాల్గుణ పరామర్శించారు. ఆస్పత్రిలో దాస్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. దాస్ త్వరగా కోలుకోవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అరకు వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ కిల్లో రాజారమేష్ బోస్, కుంతుర్ల పంచాయతీ సర్పంచ్ వంతాల చిన్నారావు, పెదబయలు మండల మాజీ వైస్ ఎంపీపీ వంతాల అప్పారావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు కొర్ర రాజారావు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల ధర్నా



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

మహారాణిపేట: సరకుల ధరలు పెరిగినందువల్ల మధ్యాహ్న భోజనం మెనూ చార్జీలు పెంచాలని కార్మికులు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం ఆందోళన చేపట్టారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.మంగశ్రీ మాట్లాడుతూ గ్యాస్ సిలిండర్ ధర విపరీతంగా పెరిగిపోయిందని, సరకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో మెనూ చార్జీలు కూడ పెంచాలని కోరారు. ఇతర సమస్యలను పరిష్కరించాలన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు డి.రాము, పి.మణి తదితరులు పాల్గొన్నారు.

ఆపద్బాంధవుడు ఎమ్మెల్యే వాసుపల్లి



అంబేద్కర్ సేవా సంఘం నాయకలకు రూ.10వేలు చెక్కు అందజేస్తున్న వాసుపల్లి

అల్లిపురం: ఆపదలో ఉన్నవారిని ఆదుకుని మరోసారి తన ఉదారతను చాటుకున్నారు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్. జీవీఎంసీ 33వ వార్డు అధ్యక్షుడు రంధి గోపీకృష్ణ తనయుడు గిరీష్ కొంత కాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. కేర్ హాస్పటల్‌లో చికిత్స పొందుతున్న ఆయనను వాసుపల్లి సోమవారం పరామర్శించారు. అతనికి తన సొంత నిధుల నుంచి రూ.20వేలు సహాయం అందజేశారు. ఆస్పత్రి డాక్టర్లతో మాట్లాడి గిరీష్‌కు మెరుగైన వైద్యం అందజేయాలని కోరారు.

అంబేద్కర్ జయంతి ఉత్సవాలకు చేయూత

నియోజకవర్గంలో ఐదు రెల్లివీధుల్లో ఈ నెల 14న నిర్వహించే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంత్యుత్సవాల నిర్వహణ కోసం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సేవా సంఘం నాయకులకు ఎమ్మెల్యే రూ.10వేలు సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో 41వ వార్డు నాయకుడు కోడిగుడ్డ శ్రీధర్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, జేసీఎస్ ఇన్‌చార్జ్‌లు దొడ్డి రామానంద్, కర్రి నీలకంఠం, రెల్లివీధి అంబేద్కర్ సంఘం పాలకవర్గ సభ్యులు, 30వ వార్డు అధ్యక్షుడు దశమంతుల మాణిక్యాలరావు, చిన్ని, సింగంపల్లి కళ్యాణ్‌ముని, కస్తూరి వెంకటరావు, పాడుగు ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

వినూత్నంగా వినతి పత్రం



గడియారంలో ముద్రించిన వినతిపత్రాన్ని జెడ్సీకి అందిస్తున్న విల్లూరి

జగదాంబ: ఇందిరా ప్రియదర్శిని క్రికెట్ స్టేడియం చుట్టూ దుకాణ సముదాయాల నిర్మాణం చేపట్టాలని కోరుతూ జీవీఎంసీ 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరావు వినూత్నంగా వినతి పత్రం అందజేశారు. జోనల్ కార్యాలయంలో జెడ్సీ శివ ప్రసాద్‌ను సోమవారం కలిసి, గడియారంపై ముద్రించిన వినతి పత్రాన్ని అందజేశారు. విల్లూరి మాట్లాడుతూ స్టేడియం చుట్టూ ఉన్న విశాల స్థలంలో ఆక్రమణలు జరుగుతున్నాయన్నారు. వాటిని అడ్డుకోవాలని కోరారు. వారికే దుకాణాలు నిర్మించి ఇస్తే, జీవీఎంసీకి ఆదాయంతో పాటు యువతకు ఉపాధి కలుగుతుందని పేర్కొన్నారు. ఎప్పటికీ గుర్తుండిపోయే విధంగా గడియారంలో వినతి పత్రం ముద్రించి జెడ్సీకి అందజేశారు.

డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి

మహారాణిపేట: డీఎస్సీ, గ్రూప్-2 నోటిఫికేషన్లు తక్షణం విడుదల చేయాలని డీవైఎఫ్ఐ గ్రేటర్ విశాఖ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం ప్రదర్శన చేపట్టారు. జిల్లా అధ్యక్షుడు యు.ఎస్.ఎన్.రాజు మాట్లాడుతూ డీఎస్సీ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న 25 వేల ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేయాలని, జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గ్రూప్-2 నోటిఫికేషన్ ఇవ్వాలని, ఇతర ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరారు. వీటిపై కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో కార్యదర్శి కె.సంతోష్ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ముదపాక రైతుల వినతి

మహారాణిపేట: ముదపాక భూములపై విచారణ చేపట్టాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ముదపాక రైతులు కలెక్టర్‌ను సోమవారం కలిసి వినతి పత్రం సమర్పించారు. పెందుర్తిలో కొంత మంది రెవెన్యూ అధికారులు రైతులను ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. దళిత రైతులను ఇబ్బంది పెట్టడం భావ్యం కాదని, రైతులకు ఎల్‌పీ సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరారు.

నేడు పోలమాంబ మారువారం పండగ



పోలమాంబ అమ్మవారు

ఏయూ క్యాంపస్: శ్రీపోలమాంబ అమ్మవారి మారువారం పండగ మంగళవారం జరగనుంది. సాధారణ జాతరతో సమానంగా మారువారం పండగను నిర్వహించడం సంప్రదాయం. ఈ సందర్భంగా మంగళవారం కూడా పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకోనున్నారు. ఇందుకు అనుగుణంగా ఆలయంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. అదే విధంగా ఈ నెల 15న ఆలయ ప్రాంగణంలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు.

ముమ్మరంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

మద్యం తాగిన వాహన చోదకులపై కేసులు, జరిమానా



వాహనాలు తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు

మర్రిపాలెం: గత పది రోజులుగా కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు కంచరపాలెం, ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్ల పరిధిలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై ప్రత్యేక నిఘా పెట్టి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి 11 గంటల నుంచి సోమవారం తెల్లవారు వరకు జ్ఞానాపురం బ్రిడ్జి నుంచి కంచరపాలెం మెట్టు వరకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. లారీలు, ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలపై కొరడా ఝులిపించారు. ఈ పది రోజుల్లో 48 మందిపై కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేశామని కంచరపాలెం ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు తెలిపారు. అందులో 27 మందిని మెట్రోపాలిటిన్ మేజిస్ట్రేట్ ముందు హాజరు పరిచి రూ.33 వేలు జరిమానా విధించినట్టు చెప్పారు. రోడ్డు ప్రమాదాలు అరికట్టేందుకు ముందస్తు చర్యగా స్పెషల్ డ్రైవ్ చేపట్టామన్నారు. గతంలో జరిమానాలు విధించి కట్టని వాహన చోదకుల నుంచి వసూలు చేశామన్నారు. ఎస్ఐలు వాసుదేవరావు, పాపారావు, ఉల్‌హక్ ప్రత్యేక బృందాలుగా తనిఖీ చేపట్టారని సీఐ తెలిపారు.

జ్ఞానవిస్తృతికి ఐఎస్‌టీడీ కృషి

మురళీనగర్: జ్ఞానవిస్తృతిని పెంచడమే ప్రధాన లక్ష్యంగా ఇండియన్ సొసైటీ ఫర్ ట్రెనింగ్ అండ్ డెవలప్‌మెంట్ సంస్థ పనిచేస్తోందని ఐఎస్‌టీడీ వైజాగ్ చాప్టర్ చైర్మన్ డాక్టర్ ఓఎం రావ్ తెలిపారు. ఐఎస్‌టీడీ 53వ ఆవిర్భావ దినోత్సవం సోమవారం కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 52 చాప్టర్లు ఉన్నాయని, వైజాగ్ చాప్టర్‌లో వివిధ సాంకేతిక విభాగాల్లో ఉన్నత పదవుల్లో పనిచేసిన 600 మంది ప్రముఖులు సభ్యులుగా ఉన్నట్లు చెప్పారు. కాలేజీల్లో ఏర్పాటు చేసిన స్టూడెంట్ చాప్టర్ల ద్వారా వీరు విద్యార్థులకు వారి సబ్జెక్టుతోపాటు నైపుణ్యాల సాధనకు అవసరమైన పరిజ్ఞానాన్ని అందిస్తారని వివరించారు. ఒకరికొకరు పరిచయం చేసుకోవడం ద్వారా నాలెడ్జ్ ఎన్‌హ్యాన్స్‌మెంట్ సులువవుతుందన్నారు. సాంకేతిక విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు మారుతున్న సాంకేతిక విధానాలకు అవసరమైన జ్ఞానసముపార్జన ఉండాలన్నారు. ఈ చాప్టర్ల ద్వారా నిపుణుల సేవలను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు డాక్టర్ రావ్ సూచించారు. వారు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో కెమికల్ విభాగం హెడ్ డాక్టర్ బీవీ లక్ష్మణరావు, ఇతర విభాగాల హెడ్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.

హైవేలో రెండు రోడ్డు ప్రమాదాలు

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి లోని జాతీయ రహదారిపై సోమవారం రెండు రోడ్డు ప్రమాదాలు జరిగాయి. శాంతిపురం రహదారిపై ఓ కారును అతివేగంగా వచ్చి స్కూటీ ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు సైడ్ భాగం దెబ్బతింది. స్కూటీతో ఢీకొట్టిన యువకుడి కాలుకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించా రు. మరో ఘటనలో కారును లారీ ఢీకొట్టడంతో కారు వెనుక భాగం నుజ్జునుజ్జయింది. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. రెండు వర్గాల వారు ఫోర్త్‌టౌన్ పీఎస్‌లో ఫిర్యాదులు చేశారు.

పోటీ పరీక్షలకు సమ్మర్ కామన్ కోచింగ్

దాబాగార్డెన్స్: అన్ని పోటీ పరీక్షలకు అవసరమయ్యేలా సమ్మర్ కామన్ కోచింగ్ ప్రారంభించనున్నట్టు అల్లూరి స్టడీ సర్కిల్ నిర్వాహకుడు కె.అభిమన్యు ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యాలయాల ప్రవేశాలకు ఉపయోగపడేలా ఈ కోచింగ్ సెంటర్ నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. 2 నెలల పాటు నిర్వహించే ఈ తరగతులు వేసవి సెలవుల్లో యువత సమయాన్ని వృథా చేయకుండా, అభివృద్ధికి దోహదం చేసేలా ఉంటాయన్నారు. విద్యాలయాల ప్రవేశ పరీక్షల్లోను, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు కామన్‌గా ఉండే ఇంగ్లిష్ లాంగ్వేజ్, అర్థమెటిక్, రీజనింగ్, జీకే, కరెంట్ అఫైర్స్ సబ్జెక్టులు బోధిస్తారని తెలిపారు. మరింత సమాచారం కోసం డాబాగార్డెన్స్‌లోని అల్లూరి స్టడీ సర్కిల్లో స్వయంగా, లేదా 80084 12798 ఫోన్‌లో సంప్రదించవచ్చు.

ఏయూ సమాచారమ్

సమర్థవంతంగా మురుగునీటి నిర్వహణ



ప్రసంగిస్తున్న ఐఐపీఈ సంచాలకులు ఆచార్య శాలివాహన్

ఏయూ క్యాంపస్: మురుగునీటిని సమర్థవంతంగా నిర్వహించడం, పునర్వినియోగంగా మార్చడం ఎంతో అవసరమని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం ఎనర్జీ సంచాలకుడు ఆచార్య శాలివాహన్ అన్నారు. ఐఐపీఈ సమావేశ మందిరంలో ‘వేస్ట్ వాటర్ క్యారక్టరైజేషన్, ట్రీట్‌మెంట్-రీయూజ్’ అంశంపై రెండు రోజుల వర్క్‌షాప్‌ను ఆయన సోమవారం ప్రారంభించారు. అనంతరం శాలివాహన్ మాట్లాడుతూ మురుగునీటి నిర్వహణ విధానాలు, ప్రాధాన్యతను వివరించారు. ఏపీ కాలుష్య నియంత్రణ మండలి జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ టి.రాజేంద్ర కుమార్‌రెడ్డి మాట్లాడుతూ మురుగునీటి లక్షణాలను శాస్త్రీయంగా తెలుసుకోవడం, శుద్ధి చేసే విధానాలు, పునర్వినియోగం చేయడం ప్రస్తుతం ఎంతో అవసరమన్నారు. నీటి వనరుల లభ్యత తగ్గుతూ, వినియోగం పెరుగుతున్న తరుణంలో మురుగునీటిని సైతం శుద్ధిచేసి ప్రత్యేక అవసరాలకు వినియోగించాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. సదస్సులో పాల్గొన్న వారికి ప్రత్యక్ష జ్ఞానాన్ని అందించే విధంగా ఐఐపీఈ ప్రయోగశాలను సందర్శించారు. మురుగనీటి పునర్వినియోగంలో ఎదురయ్యే సవాళ్లపై చర్చ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐఎన్ఎల్ ప్రతినిధి జి.ఫణికుమార్, సదస్సు కన్వీనర్ డాక్టర్ రవికుమార్ సోన్వాని, తదితరులు పాల్గొన్నారు.

ఎండలు బాబోయ్ ఎండలు



సీతంపేట రోడ్డులో చెరకురసం తాగుతున్న యువత



గొడుగు నీడలో ఇంటికి వెళ్తున్న విద్యార్థులు

సీతంపేట: సూర్యుడు భగభగలాడుతున్నాడు. ఉదయం నుంచి నిప్పులు చెరుగుతున్నాడు. వేడిగాలులతో ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాడు. దీనికి తోడు విపరీతమైన ఉక్కపోత. ఇది నగరంలోని వేసవి ప్రభావం. నిన్న మొన్నటి వరకు ఒక మోస్తరుగా ఉన్న ఎండలు రెండు రోజులుగా తీవ్ర ప్రభావాన్ని చూపడంతో జనం హడలిపోతున్నారు. ఏప్రిల్ మొదట్లోనే ఎండలు మండిపోతుంటే.. మేలో తీవ్రతను తలచుకుని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో నగరవాసులు వేసవి తాపంతో అల్లాడిపోయారు. సోమవారం నుంచి రెండు రోజుల పాటు ఎండ తీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ ముందే హెచ్చరించింది. దానికి తగ్గట్టుగానే ఉదయం నుంచి ఎండ వేడిమి అధికంగా ఉండటంతో జనం రోడ్డుపైకి రావాలంటే హడలిపోయారు. కొంత మంది పనులు వాయిదా వేసుకుంటున్నారు. అత్యవసర పనులపై కొంతమంది బయటకు వస్తున్నారు. వేసవి తాపం నుంచి ఉపశమనం పొందడానికి చెరకు రసం, కొబ్బరి నీళ్లు, ఫ్రూట్ జ్యూస్‌లు, కూల్ డ్రింక్‌లు వంటి శీతల పానీయాలు సేవించడంతో ఆయా షాపులు వినియోగదారులతో కళకళలాడాయి.

మర్రిపాలెం రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతి

తాటిచెట్లపాలెం: మర్రిపాలెం రైల్వే స్టేషన్ సమీపంలోని టర్ ఎక్స్చేంజ్ కాంప్లెక్స్ దగ్గర సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మరణించినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు. వివరాలిలా.. సుమారు 30-35 ఏళ్ల వ్యక్తి మర్రిపాలెం స్టేషన్ సమీపంలో సోమవారం కరెంటు షాక్ వల్ల చనిపోయాడు. ఈ వ్యక్తి ఏదైనా గూడ్స్ రైలుపై నుంచి విద్యుత్ వైర్లను పట్టుకోవడం వల్ల, కరెంట్ షాక్ తగలడం వల్ల లేదా మరే ఇతర కారణాల వల్ల అయిన మరణించి ఉండవచ్చు. ఈ వ్యక్తి బూడిద రంగు ప్యాంట్ మీద తెలుపు రంగు డాట్స్‌తో కూడిన ప్యాంట్, నీలం రంగు నిక్కరు ధరించి ఉన్నాడు. విద్యుత్ షాక్ వల్ల శరీరం నల్లబడి పోయింది. ఎస్ఐ శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు జీఆర్పీ స్టేషన్ వద్ద స్వయంగా గానీ లేదా 94406 27547, 98664 13487 నంబర్లలో తెలియజేయాలని కోరారు.

సాక్షి

మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ సౌత్
7997958342, 9912440606

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ సౌత్
9010196663
Office mail : sakshiadvtvsp@gmail.com